క్లుప్తంగా

సేవా సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి: వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో ప్రచురించిన గజలక్ష్మి అమ్మవారి క్యాలెండరును శుక్రవారం స్థానిక నాజరుపేటలోని విద్యాశంకర భారతీయ నృసింహ సదనంలో సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భగవద అవతారాలకు సంబంధించిన క్యాలెండర్లను ముద్రించి బ్రాహ్మణ కుటుంబాలకు అందిస్తున్నట్లు తెలిపారు. సమాఖ్య నిర్వహించే అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా దైవారాధనకు సంబంధించిన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు భాగవతులు కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుందేటి సుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, కోశాధికారి సీహెచ్ తిరుమలరావు, బీఎస్ఎల్వీ ప్రసాద్, టి.ఆంజనేయులు, వై.పద్మజ, బుర్ర ప్రభాకరరావు పాల్గొన్నారు.

గుర్రం జాషువా పురస్కారాల ప్రదానం



తెనాలి: స్థానిక కొత్తపేటలో గల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశపు మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులు మాతంగి సత్యసాగర్‌కు గుర్రం జాషువా విజ్ఞానసమితి పురస్కారాలను ప్రదానం చేశారు. జాషువా విజ్ఞాన సమితి తెనాలి ప్రధాన కార్యదర్శి ఇనపాటి రవి కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలి ఉపాధ్యాయిని అయిన షేక్ ఫాతిమా చిత్రపటాన్ని అసోసియేషన్ సభ్యుడు నండూరి నారాయణరావు అసోసియేషన్ కార్యాలయానికి బహూకరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశరావు స్వాగతం పలికిన సభలో కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



తెనాలి: పురపాలక సంఘ పరిధిలో శుక్రవారం స్థానిక 35, 36 వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ ఆయా వార్డుల్లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు గొడవర్తి సాయిహరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వర రావు, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్ కె.శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్. హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్ స్పెక్టర్ షేక్. నజీర్, ఏఈ జానీబాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మున్నంగిలో యువకుడికి తీవ్రగాయాలు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగిలో ఓ యువకుడుకి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనపాల రవి స్థానిక వంతెన పై గురువారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉంటాన్ని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి సీఐ బెల్లం శ్రీనివాసరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని గ్రామంలో పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి.కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాలు ఎప్పుడు కడతారో?

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్లు
- కూల్చివేయాలని గతంలోనే నివేదిక ఇచ్చిన పోలీస్ గృహ నిర్మాణ శాఖ
- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు



టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వెంబడి ఉన్న క్వార్టర్లు

తెనాలిరూరల్: అధ్వాన స్థితిలో ఉన్న పోలీసు సిబ్బంది గృహ సముదాయాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఆవరణ అడవిని తలపిస్తూ పాములు, ఇతర విష కీటకాలకు నిలయాలుగా మారాయి. నివాసయోగ్యం కాని ఈ భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించడానికి సంబంధించిన ఫైలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంది. జిల్లా స్థాయి అధికారులు మారినప్పుడు ఈ శిథిలమైన భవనాలను ఒకసారి పరిశీలించి వెళ్లడం ఆనవాయితీ. భవన నిర్మాణం విషయం మాత్రం ముందుకు సాగదు.

మోడల్ పోలీస్ స్టేషన్, క్వార్టర్లు

ప్రస్తుతం ఉన్న శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించి వాటిస్థానంలో అధునాతన మోడల్ పోలీస్‌స్టేషన్, దాని వెనుక సిబ్బంది క్వార్టర్లు నిర్మించాలని యోచన పోలీసు అధికారులు చేశారు. అయితే ఉన్నతాధికారులు దీన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో కేవలం దస్త్రాలకే పరిమితమైంది. ఇక నిర్మాణాన్ని ఎప్పటికి ప్రారంభిస్తారో వేచి చూడాల్సిందే. సబ్ డివిజన్ కేంద్రం, రెవెన్యూ డివిజన్ హెడ్‌క్వార్టర్ అయిన తెనాలిలో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో నేర పరిశోధన, నేర నియంత్రణ సునాయాసమయ్యే అవకాశమూ లేకపోలేదు.

అధికారుల నివాసాలు, కార్యాలయాలకు విరాళాలు

అధికారుల నివాసాలు, కార్యాలయాలను విరాళాలతో, అన్ని వసతులతో త్వరిత గతిన నిర్మించేసుకుంటున్నారు. తెనాలి నిజాంపట్నం కాల్వ కట్టపై సబ్ డివిజనల్ కమాండ్ కంట్రోల్‌నూ ఇదే విధంగా నిర్మించేశారు. దీనికి తోడు పోలీస్ డార్మిటరీని ఈ భవనం వెంబడే నిర్మించారు. సిబ్బంది క్వార్టర్ల విషయానికి వచ్చేసరికి అధికారులకు నిబంధనలు, పోలీస్ గృహ నిర్మాణ విభాగం అంచనాలు, నిధుల మంజూరు వంటి నిబంధనలు గుర్తుకు వస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కూల్చివేతకు అనుమతులు కోరారు

కొత్తపేటలోని క్వార్టర్స్‌ను కూల్చి వేసేందుకు నిబంధనల ప్రకారం అనుమతులు పొందాల్సి ఉంది. అనుమతులను గతంలోనే అధికారులు కోరారు. అనుమతులు వచ్చిన వెంటనే కూల్చి వేసి, భవన సముదాయం నిర్మాణానికి అనుమతులకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేవు. గత నెల 7వ తేదీన జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ దీనస్థితిలో ఉన్న ఈ క్వార్టర్లను పరిశీలించారు. ఆయన చొరవ తీసుకుని భవనాలను కూల్చి వేయించి తిరిగి నూతన భవన సముదాయాన్ని నిర్మించేలా చర్యలు తీసుకుంటారేమో వేచి చూడాల్సిందే.

అడవిని తలపిస్తున్న క్వార్టర్స్ ఆవరణ

నిర్వహణ/వినియోగంలో లేకపోవడంతో క్వార్టర్స్ ఆవరణ అడవిని తలపిస్తోంది. క్వార్టర్స్ ఆవరణ మొత్తం చెత్త చెదారాలతో నిండి ఉంది. మురుగునీరు పోయేందుకు సరైన మార్గం లేక ఎక్కడికక్కడ మురుగు గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు సెప్టిక్ ట్యాంకు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలో అందుబాటులో లేని ఇంటి అద్దెల కారణంగా క్వార్టర్స్ ఇటీవలి వరకు సిబ్బంది మొగ్గు చూపారు. భవనాలు పూర్తిగా దెబ్బతినడంతో ఉండేందుకు సాహసం చేయడం లేదు. క్వార్టర్స్ నిర్మాణం పూర్తయితే అద్దెల భారం తగ్గుతుందన్న వాదన సిబ్బందిలో వినిపిస్తోంది.



అడవిని తలపిస్తున్న ఆవరణ

తెనాలి కొత్తపేటలోని పోలీస్ గృహ సముదాయం పూర్తిగా దెబ్బతింది. ఏ క్షణాన కూలుతుందో తెలియని స్థితి. 1983లో ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు క్వార్టర్స్‌ను ప్రారంభించారు. మొత్తం 60 కుటుంబాలు నివసించేందుకు వీలుగా చేపట్టిన ఈ నిర్మాణం పూర్తిగా దెబ్బతింది. గోడలన్నీ దెబ్బతిని బీటలు వారాయి. సీలింగ్ పెచ్చులు పెచ్చులుగా రాలుతోంది. ఇక తలుపులు, కిటికీల సంగతి సరేసరి. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని గృహసముదాయం. పోలీసు ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మిగిలింది. ఈ క్వార్టర్స్‌లో ఉండేది కానిస్టేబుళ్లే కావడంతో ఏ అధికారి చూపు ఇటువైపు పడలేదు. ఇటీవలి వరకు కొంతమంది కానిస్టేబుళ్లు ఇక్కడ నివసించే వారు. భవన సముదాయాన్ని పరిశీలించిన పోలీస్ గృహ నిర్మాణ విభాగం, ఉన్నతాధికారులు, భవనాలు మరమ్మతులకు పనికిరావని, కూల్చివేసి నూతన భవనాలను నిర్మించాలని నివేదిక తయారు చేశారు. ఇందుకు సంబంధించి అంచనాలూ సిద్ధం చేశారు.



కొత్తపేటలోని పోలీసు గృహ సముదాయం

అనధికార కుళాయి కనెక్షన్లపై చర్యలు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి: వివిధ వార్డులు, అపార్టుమెంట్లలో అనధికార మంచినీటి కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ కనెక్షన్లుగా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలియజేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార కుళాయి కనెక్షన్ల విషయమై పరిశీలన చేశారు. వీటన్నిటినీ రెగ్యులర్ కనెక్షన్లుగా మార్చుకోవాలని స్పష్టంచేశారు. లేకుంటే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1965, సెక్షను 332 ప్రకారం (గెజిట్ నెం.9, తేదీ 9.12.2012) తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

చేతివృత్తిదారులకు నైపుణ్య సాంకేతిక శిక్షణ

తెనాలి: పట్టణ మున్సిపాలిటీ పరిధిలో వివిధ రకాలైన చేతివృత్తిదారులు (సర్వీస్ ప్రొవైడర్స్)కు నైపుణ్య సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్లంబర్, కార్పెంటరీ, ఎలక్ట్రీషియన్, ఎయిర్ కండిషనర్, టీఈ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ వంటివి మరమ్మతులు, పెయింటర్, బ్యూటీషియన్ (స్త్రీ, పురుషులు)కు తగిన నైపుణ్య సాంకేతిక శిక్షణనిచ్చి, కోర్సు సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు అర్హులైనవారిని సర్వీస్ ప్రొవైడర్లుగ గుర్తించి వారిసేవలను మున్సిపాలిటీ ద్వారా అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈనెల ఆరో తేదీలోగా మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో తమ పేర్లు, వివరాలతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషనుకార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు కాపీలతోపాటు అనుభవ ధృవీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో 'సినిమా'కు రూట్ మ్యాప్ సిద్ధం చేయండి

- తగిన విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించాలి
- మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి: అమరావతి పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లు యథేచ్ఛగా జరుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని మూవీ ఆర్టిస్టు అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (మా-ఏపీ) స్వాగతిస్తోందని 'మా-ఏపీ' వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా చెప్పారు. ఇందుకు తగిన రూట్‌మ్యాప్‌ను ప్రభుత్వం విడుదల చేయాలనీ, తగిన విధివిధానాలను ప్రకటించాలని కోరారు. స్థానిక 'మా-ఏపీ' 'కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినిమాలకు పనిచేస్తున్న సాంకేతిక నిపుణులు, నటీనటులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వ రూట్‌మ్యాప్ ఉండాలని అభిప్రాయపడ్డారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణలపై తగు చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. రైల్వే స్టేషన్, విమానాశ్రమాల సెట్లు ఈరోజుల్లో అధిక శాతం సినిమాలకు షూటింగ్ నిమిత్తం అవసరం అవుతున్న నేపథ్యంలో వీటిపై ఫోకస్ పెట్టాల్సి ఉందన్నారు.

సినిమా పరిశ్రమకు అరవై శాతం రెవెన్యూ ఆంధ్ర ప్రదేశ్ నుంచి వస్తోందని గుర్తుచేశారు. దీనిపై ఆంధ్రలోనే ఇప్పటికే నివాసం ఉంటున్న సినిమా పెద్దల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. వీరితో సహాయ దర్శకులు నరేష్ దోనే, మణివరన్ ఉన్నారు.

నేడు తెనాలిలో అవగాహన సదస్సు

తెనాలి: స్థానిక నాజరుపేట అనుగోలువారి వీధిలోని విద్యాశంకర భారతి నృసింహ సదనంలో శనివారం సాయంత్రం 4 గంటలకు హ్యాపీనెస్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు పర్యవేక్షకుడు కుంచనపల్లి గోపాలరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు రవిశంకర్ గురూజీ శిష్యుడు దండు శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆనందం బహుళ వ్యక్తీకరణ, సుదర్శన క్రియ, యోగ, ప్రాణాయామం, ధ్యానం, సామూహిక ప్రక్రియలు తదితర అంశాలను వివరిస్తారని తెలిపారు సదస్సుకు వయసుతో నిమిత్తం లేకుండా కుటుంబ సభ్యులందరూ హాజరు కావచ్చునన్నారు పట్టణం పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి, గౌరవాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, కోశాధికారి సీహెచ్ తిరుమలరావు, కుంచనపల్లి ఛాయారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ

తెనాలి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మాతాశిశు సంరక్షణ, ఎన్‌సీడీసీడీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ సూచించారు. స్థానిక నందులపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య కార్యదర్శులు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అవసరమైన వైద్య సాయం కోసం పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యసహాయం పొందవచ్చని తెలిపారు.

జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీ కృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే, దోమలు అభివృద్ధి కాకుండా ఉంటాయని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపు వ్యాధి వంటి లక్షణాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. ప్రజలకు దోమ తెరల యొక్క ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. 2027 నాటికి మలేరియా కేసులు జీరోగా ఉండాలని 2030 నాటికి మలేరియా రహిత భారత దేశం రూపొందాలని లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, డాక్టర్ కిషోర్, డాక్టర్ మౌనికకుమార్, డాక్టర్ మహిత, డాక్టర్ హస్నుక్ డాక్టర్ హరిణి, సహాయ మలేరియా అధికారులు ధనావత్ రాజునాయక్, చిరసాని ప్రభాకర్ రెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, సుధాశివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ ఈడుపుగంటి అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణంలు చినరావూరులో పర్యటించిన ఫ్రైడే డ్రైడేను పరిశీలించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

తెనాలి: దళిత బహుజన స్త్రీ జనోద్ధరణకు, మహిళా విద్యకు, తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమయి సావిత్రిబాయి పూలే అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. బీసీ నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 180 ఏళ్లక్రితం విద్యవిప్లవ క్రాంతి 'సావిత్రిబాయి పూలే' వేసిన విద్యా పునాదులే నేటి స్త్రీ స్వేచ్ఛకి ప్రధాన కారణమని, కుల మతాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన నిమ్నజాతి ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అర్ధాంగి సావిత్రిబాయి పూలేఅని గుర్తుచేశారు. బీసీ నాయకులు కుర్రా శ్రీను, కొల్లూరి హనుమంతరావు, వేముల కృష్ణ, జె.వెంకట శివ కళ్యాణి, జె.హేమలత, శివరామకృష్ణ, రాహుల్, రమేష్, కె.సాయి పాల్గొన్నారు.

నవచైతన్య బీసీ సంక్షేమ సంఘంచే...

ఏపీ నవచైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్లోని కార్యాలయంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి, బాలికా విద్యకు దోహదపడటమే కాకుండా, సమాజంలోని అనేక దురాచారాల నిర్మూలనకు కృషిచేశారని స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లంపల్లి భీమ్మపాములు, కార్యవర్గ సభ్యులు మేడిబోయిన రమణ, నియోజకవర్గ అధ్యక్షుడు తాడిబోయిన ప్రవీణ్‌కుమార్ యాదవ్, పి.యలమంద, జస్వంత్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ బాలుర హైస్కూలులో...

ఆనాటి సామాజిక పరిస్థితులలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని మహిళల విద్యా వికాసానికి సాహసోపేతంగా ముందడుగు వేసిన తొలి ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలే అని కొత్తపేటలోని మునిసిపల్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ అన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు 'సావిత్రి భాయి పూలే' జయంతిని రోజైన శుక్రవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దటమే కాకుండా ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, అసోసియేషన్ గేమ్స్‌లో ప్రతిభ కనపరచి రాష్ట్ర జాతీయస్థాయిల్లో స్థానం సంపాదించేలా 33 మంది విద్యార్థులను తీర్చిదిద్దిన స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని ప్రసాద కుమారిని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్, సభ్యులు చుక్కా భానుప్రసాద్, శర్మ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలిరూరల్: 1848లోనే పాఠశాలను ప్రారంభించి మహిళలకు విద్య నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేసిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సావిత్రి బాయి పూలే జయంతిని బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మరో ఎంఈవో వి.జయంతిబాబు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై బహుజన ఉపాధ్యాయ సంఘాలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీటీఏ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గురిందపల్లి వేమయ్య, పాలపర్తి బాలాజీ, ఎన్ఆర్‌కే బాబు. ఎనఖ్. ప్రసూనదేవి, పి.నాగమ్మ, టి. జయపాల్, డి. ప్రకాశరావు, పి.విజయానంద్, కె.రమేష్, బి. సుధాకర్, ఎ. సురేష్‌బాబు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో...

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీవీ సుధారాణి మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా, బాలిక పాఠశాలలు నెలకొల్పి అందరూ చదువుకోవాలని విద్యావ్యాప్తికి సావిత్రి బాయి పూలె చేసిన కృషిని స్మరించుకున్నారు. ఉపాధ్యాయినులంతా ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. స్కౌట్ మాస్టర్ ఒ.స్వామి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు

టీడీపీ కార్యాలయంలో...

స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, దుర్గా, మల్లవరపు విజయ్, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణ, రాంబాబు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళి



నవచైతన్య బీసీ సంక్షేమ సేవాసంఘంచే సావిత్రిబాయి జయంతి



భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో...



మున్సిపల్ బాలుర హైస్కూలులో పీఈటీకి సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి

అబద్ధపు హామీలతో మభ్యపెట్టారు

కూటమి ప్రభుత్వంపై ఏబీవీపీ ధ్వజం

తెనాలిరూరల్: అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ వేదశ్రీ, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ లోకేష్ తదితరుల నేతృత్వంలో చేపట్టిన నిరసన ర్యాలీలో పెద్ద సంఖ్యలో డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తూ ఏబీవీపీ జెండాలు, బ్యానర్లు పట్టుకుని ర్యాలీగా మార్కెట్ వంతెన వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మెరుపు ధర్నా నిర్వహించారు. విద్యార్థులు, నాయకులు కలిసి నాలుగులైన్ల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు లోకేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 4500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. అబద్ధపు హామీలతో మభ్యపెట్టారని, పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లుగా విద్యార్థుల పరిస్థితి తయారైందని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి ఇచ్చిందని, ఈ ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చందు, రేవంత్, కె.సుధీర్, ఎం. సతీష్, డి.రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఫరూక్ అహ్మద్‌కు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్

తెనాలి: పట్టణానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ సయ్యద్ ఫరూక్ అహ్మద్‌కు ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'స్టడీస్ ఆన్ రిమూవల్ ఆఫ్ హెవీ మెటలల్స్ లెడ్ అండ్ కాపర్' అంశంపై చేసి సమర్పించిన పరిశోధన థీసిస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను బహూకరించింది. నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫరూక్ అహ్మద్, ప్రొఫెసర్ బీవీ సారథి పర్యవేక్షణలో ఈ పరిశోధనను చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ అహ్మద్‌ను కాలేజీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్‌ఛైర్మన్ వాసిరెడ్డి మహాదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్.కుమారస్వామి, సివిల్ విభాగాధిపతి టి.శ్రీధర్‌బాబు అభినందించారు. తెనాలికి చెందిన ఫరూక్ అహ్మద్ తండ్రి సయ్యద్ షాజహాన్, తాత అజీమ్‌ఖాన్‌లు ఇద్దరూ సివిల్ ఇంజినీర్లు. వారి బాటలోనే తను కూడా సివిల్ ఇంజినీరింగ్ చేయటమే కాకుండా పీహెచ్‌డీ చేశారు.

